# లోవెలుగు



విహారి

తెనాలి నుంచీ నరసమ్మ ఉత్తరం రాయించింది – ఉన్నపళంగా వోసారి వచ్చి పొమ్మని.

బ్రహ్మానందం పెదనాన్నని గురించి నా అభిప్రాయాల లెక్కలు నరసమ్మ దగ్గర వున్నాయి. ఇది నాకు తెలుసు. అయినా, ఆవిడ–నాకు ఉత్తరం రాయించిందంటే ఆశ్చర్యం వేసింది.

"వెళ్లి రండి, విషయం తెలుస్తుంది" అంది రమ.

పదిహేనేళ్ల తర్వాత–మళ్లీ నేను తెనాలికి బయల్దేరాను. కతెవరం వంతెన; ఐతానగర్; పడవల కాలువ, పంట కాలువ, పెదరావూరు రోడ్డు, గాంధీచౌక్, కాలేజీ భవనాలు– అన్నీ నా చిన్నప్పటి విహారస్థలాలు– కళ్లల్లో మెదిలి, ఆలోచనల్లో కదిలి– మనస్సును చిత్రమైన అనుభూతికి గురిచేసినై.

బస్సు ముందుకు పోతోంది. నా ఆలోచన వెనక్కు నడిచింది.

బ్రహ్మానందంగారు మా నాన్నకి అన్న. పదిహేనేళ్ల క్రితం అరవయ్యో ఏట నాన్న పోయారు. ఆయనకీ ఈయనకీ మధ్యన నాకో మేనత్త వుంది. ఆ లెఖ్ఖన బ్రహ్మానందంగారి వయస్సు ఇప్పుడు సుమారుఎనభై పైమాటే. వాళ్లు–నలుగురు అన్నదమ్ములూ, ఐదుగురు అప్పచెల్లెళ్లూ.

బ్రహ్మానందం పెదనాన్నకి ఎనిమిది మంది కొడుకులు, ఒక్కతే ఆడపిల్ల. మా నాన్నకేమో నేనొఖ్ఖణ్నే ఒకే వొక్క నలుసుని.

తన సంతానం, కోడళ్లూ, అల్లుళ్లూ, మనుమలూ మనుమరాండ్రూ, మేనల్లుళ్లూ వాళ్ల భార్యాబిడ్డలూ, మేనకోడల్లూ వాళ్ళ భర్తలూ, వీళ్ళందరికూ నా గుజ్జూ—అంతా కలిసి ఆయనదో పెద్ద బలగం. సంపదకీ కొదవేం లేదు. తండ్రి ఆస్థిని పాతికెకరాల చొప్పున పంచుకున్నారు, అన్నదమ్ములు.

బ్రహ్మానందంగారు ఆ కాలంలో స్వాతంత్ర్యోద్యమంలో తిరిగేరు. లాఠీ దెబ్బలు తిన్నారు; ఊళ్లుపట్టుక తిరిగారు; జైలు సంగతి సరేసరి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అది ఆయన కొడుకులకీ స్వాతంత్ర్యాన్నిచ్చింది. ఆయనకు మాత్రం ఆ 'ఫలం' దక్కలేదు.

వెనక్కి తిరిగి చూసుకునే సరికి—సున్నకు సున్న హళ్లికి హళ్లి అన్నట్లయింది — ఆయన ఆర్థిక పరిస్థితి. భార్య పోయింది. ఆడపిల్ల పెళ్లి ఎప్పుడో అయిపోయి వుండటం—'గుడ్డిలో మెల్ల' అనిపించింది, ఆ స్థితిలో

బస్సు ఏదో వూళ్లో ఆగింది. రోడ్డు పక్కనే ఇళ్లు—విసిరేసిన పిండిగోళీల్లా. గుడిలో గంటల శబ్దం వినిపిస్తోంది.

నా పక్కగా కూర్చున్న వ్యక్తుల్లో ఒకతను అంటున్నాడు, "ఓడలు బండ్లు కావడం, బండ్లు వోడలు కావడం సహజం. ఎన్ని సంసారాలు చూళ్లేదు గనుక?!"

బస్సు కదిలింది. నా ఆలోచనా సాగింది.

బ్రహ్మానందం పెదనాన్న కొత్త జీవితం ప్రారంభించాడు. కొత్త రెక్కలు తొడుక్కున్నాడు. కొడుకుల నుంచీ తప్పుకున్నాడు. అయినవాళ్లందరి నుంచీ దూరంగా జరిగిపోయాడు.

అప్పటి వరకూ జీవితంతో పట్టిన కుస్తీపట్లతో ఆయన అలసిపోయి కూలబడతారనుకున్న వాళ్లంతా నోళ్లప్పగించి చూస్తూ వుండిపోయారు.

అంటుగట్టిన కొమ్మలా నరసమ్మ ఆయన జీవితంలోకి ప్రవేశించింది.

నరసమ్మని తెచ్చుకున్నాడని కొందరూ, కాదు నరసమ్మే వచ్చిందని కొందరూ అనుకున్నారు. ఆమెది ఆయన కులం కాదని తెలుసుకున్నారు గానీ, ఎక్కణ్ణుంచి వచ్చిందో మాత్రం ఆచూకీ దొరకలేదు వాళ్లకి.

ఆయన వో చిన్న హోటల్ ప్రారంభించాడు. దానికి ఆయన యజమాని, ఆయనే వంటవాడు. నరసమ్మ సర్వరూ, క్లీనరూ అయింది.

మా వూరివాళ్లకి అదొక వింత, విడ్డూరం అయింది. క్షణంలో బ్రహ్మానందంగారు వలపుకథకి నాయకుడైపోయాడు. అందులోనూ మా పినపాడు టౌనుకు విసిరేసినట్లు వుండేదేమో—ఆయన వ్యవహారం జనం నోళ్లలో బాగానే నానుతూవుండేది.



సాటివాళ్ళల్లో కానిపని చేశాడనీ, పిల్లలకు లోకువైపోయాడని – చాలా మంది చెవులు కొరుక్కున్నారు. అయన సంతానం సంగతి చెప్పేదేముంది– మొహాన్నే ఆయన్ని ఛీకొట్టి – తొలగిపోయేరు.

తమకోసం తాము ఏడ్చుకుంటూ, తమకోసం తాము నవ్వుకుంటూ–ఒకరి

గుండెలో వొకరు కాపురముంటూ వో పదేళ్ల బరువుగా కాలం గడిపేరు; నరసమ్మా అయనా.

నాణెం రెండోవైపుది పై చెయ్యి అయింది.

స్వంతానికి అందమైన విశాలమైన మేడని పట్నంలో కొన్నారు ఆయన. ఆ తర్వాత, మరో ఐదేళ్లయ్యేసరికీ వరద గోదావరిలా ఆయన్ని ముంచేసింది_సిరి.

జనం-ఆయన్ని గౌరవంగా సంబోధించడం మొదలెట్టేరు. ఊగలన్నీ దగ్గరైనాయి. సంతానమంతా ఆయన ముందు అణకువగా ప్రవర్తించగలమనే హామీనిస్తున్నట్టు కావలించుకో చూసేరు.

కానీ, ఊగల్ని దగ్గర కానీయలేదు అయన. నలుగురిలోనూ పెద్ద వ్యవహారవేత్తగా మారేడు.

_బస్సు కోదాడలో ఆగింది. కాఫీలకీ, భోజనాలకీ స్టాప్ అది. నేనూ దిగేను.

వాతావరణంలో చీకటి పరచుకుంది. దూరంనుంచీ వివరంలేని సవ్వళ్లు విని పిస్తున్నాయి. బస్‌స్టాండ్ మూలకి నడిచేను_ అవరణలో.

జుట్టు పట్టుకొని భార్యని కొట్టున్నాడు_వో నడివయస్సు ఆసామీ. చాలామంది ఆ వినోదపు ప్రదర్శనని చూస్తూ నిలబడ్డారు. పేకాటకు డబ్బుకోసం పెళ్లాన్ని చావబాదుతున్నాట్ట ఆ పెద్దమనిషి. అమె కాలి చేస్తుంది.

చన్నీళ్ల మొహాన్న చల్లినట్లయింది నాకు. తిరిగివచ్చి బస్‌లో కూలబడ్డాను.

బస్ బయల్దేరింది.

మా నాన్నది ముంకు స్వభావం. నోటి దురుసు ఎక్కువ. వీటికి తోడు నడివయస్సులో వుండగా ఎవరో ఒక ఆశని ఆయన బుర్రలోకి ఎక్కించారు_ ధనయోగం వుందని. ఆయన పేకాటకు దాసుడైనాడు. కొండలాంటి జీవితమే గడిపేడు. ఏటికో కోటికో తప్ప ఏనాడూ ఇంటిపట్టున వుండేవాడు కాదు. ఎప్పుడూ క్లబ్బుల్లోనో, డెన్‌లలోనో కాలం గడిచిపోయేది. టిఫిన్, కాఫీలూ, కారియర్ భోజనం, సిగరెట్‌లతోనే ఆయన బ్రతుకు తెల్లారిపోయింది.

వెర్రిదానిలా అత్తవారింటికివచ్చి వెర్రిదానిలాగానే రోజులు వెళ్లమార్చింది_అమ్మ. నాన్నముందు ఏడ్చింది; మొత్తుకుంది. తల బాదుకుంది. ఆయన ప్రవర్తనలో మార్పులేదు. అమె ఎడారి జీవితానికి నేనే ఒయాసిస్సుని. ఆయన పోయిన తర్వాత అమ్మకు కుట్టుమిషనే అధారమైంది.

బ్రహ్మానందం పెదనాన్నపట్ల నా వైముఖ్యానికి కారణం వెతుక్కోవాలంటే చాలా వెనక్కు వెళ్లక తప్పదు.

అప్పట్లో నేను నాలుగో తరగతో ఏదో చదువుతున్నాను. మా స్కూలు అటస్థలం పక్కగా వాళ్ల యిల్లు. ఓరోజు

సాయంత్రం నేను ఆటల్లో అలసిపోయి మంచినీళ్ల కోసం వాళ్లింటికి వెళ్లాను. నాతోపాటూ నా మిత్రుడు విఠల్‌కూడా వచ్చాడు. అప్పట్లో వాళ్లుంటున్నది, వో పాత కొంపలోనే, నిజానికది కొట్టిడి లాంటిది. కప్పునిండా కంతలు. నేను వెళ్లేప్పటికీ కుంపట్లో మొక్కజొన్న కండెలు కాలుస్తోంది—నరసమ్మ. లో వాకిలి దగ్గర నిలబడ్డాడు విఠల్. నా పుస్తకాల దొంతర అతని చేతికిచ్చి—నేను లోపలికి వెళ్లి మంచినీళ్లు అడిగేను. నరసమ్మ ఇచ్చింది. విఠల్‌నీ అడిగింది. వాడు కావాలన్నట్టు తలవూపేడు. ఆమె మరో గ్లాసుతో నీళ్లుతెచ్చి వాడికిచ్చింది. ఇద్దరమూ నీళ్లుతాగి వచ్చేస్తుంటే ఆమె మళ్లీ పిలిచింది. మేము ఆగేము. ఒక కండెను తుంచి చెరో సగమూ మా చేతుల్లో పెట్టింది. ఆమె చూపుల్లో అదో తృప్తి. ఆ రాత్రి— మా యింటికొచ్చి పెద్ద రాద్ధాంతం మొదలెట్టాడు బ్రహ్మానందం పెదనాన్న. తన బొందు పుస్తకమేదో నేను దొంగిలించుకొచ్చానట. అందులో ఆయన హోటల్ లెఖ్ఖలున్నాయట. నాకేమీ తెలియదని నేను బెరుగ్గా సమాధానం చెప్పేను. నా మెతకతనం, బెరుకూ బహుశా ఆయన నమ్మకాన్ని మరింత రూఢిచేశాయి కాబోలు—నాలుగు అంటించాడు. అమ్మేమో నా కళ్లలోకి చూస్తూ "చెప్పు నాన్నా— ఎక్కడ పెట్టావో చెప్పు. ఇచ్చేసేయ్" అంటోంది. నాకేమో లోపల కోపం, కసి. అన్యాయంగా నన్ను కొడతాడేమో అని రోషం. నాకు తెలీదని గట్టిగా అరిచేను. వో అర్ధ గంట తర్వాత ఆయన బూతులు తిడుతూ వెళ్లిపోయాడు. నా గుండెల్లో వొక విషపు బాణం గుచ్చినట్లైంది. ఆ పుస్తకాన్ని విఠల్ పట్టుకుపోయాడని మర్నాడు తేలింది. మనస్సు విరిగిపోవడమంటే ఇదే అని పెద్దయిన తర్వాత తెలుసుకున్నాను.

బస్‌లోనుంచీ పక్కకి చూశాను. బస్ వంతెన దాటుతోంది. వంతెన క్రిందుగా కాలవ. నీళ్లు జలజలా పారుతున్నై.

—శివరాత్రికి అమ్మా నేనూ సంగం జాగర్లమూడి వెళ్లాము. స్నానాలు చేసుకుని దేవుణ్ణి చూసి గుడి ఆవరణదాటి బయటి కొచ్చాం. అన్నీ అంగళ్లు. చెక్కబొమ్మలు, గాజులు, దువ్వెనలు, అద్దాలు, కుండలు, బాటలూ, విసనకర్రలూ, చిలకలపూడి నగలూ. వాటి పక్కగా చెరకుగడలూ, మంచం మిఠాయిలూ, ఐస్‌క్రీమూ, పీచుమిఠాయీ—అన్నీ నాకు అందని ద్రాక్షపళ్లు! దైన్యాన్ని కళ్లలోనూ, ఆశని గుటకల్లోనూ తొక్కిపెట్టి— అవన్నీ చూస్తున్నాను. అమ్మ నా ప్రక్కగా నడుస్తోంది. "ఒరేయ్ రాజిగా" అన్న పిలుపుకు ప్రక్కకి చూస్తూ ఆగేము. మా పెదనాన్న. ఆయన ఇడ్లీలూ ఉప్మా కొట్టుపెట్టేడు. ఆయన

పక్కగా నరసమ్మ. ఆకులో ఇడ్లీలు పెట్టి ఎవరికో అందిస్తోంది. ఆయన మా అమ్మతో అన్నాడు. "వీణ్ణిక్కడ వుంచిపో. రాత్రికి మాతో వస్తాడు. జనం బాగా వచ్చారు. బేరం బాగానే వుండేట్టుంది. గ్లాసులు తియ్యడానికన్నా ఉపయోగపడతాడు." వెంటనే నా వైపు చూసి, "ఏరా, ఇడ్లీ తిని ఇక్కడే వుండు" అన్నాడు. నేను తక్కువ సమాధానం చెప్పేను. "నీ ముష్టి నాకేం అక్కర్లేదు. నేను ఉండను." గబగబా ముందుకు వెళ్ళిపోయాను. ఆయన చిరాకుపడుతూ అమ్మతో అంటున్నాడు, "అయ్యలాగానే వట్టి పెంకిఘటం. ఆ తలబిరుసుతనం చూడు." నేను ముందుకు నడిచి మలుపు తిరిగేసరికీ, తన కొట్టు వెనగ్గా— గుడి ప్రహరీకీ కొట్లకీ మధ్యగా నరసమ్మ నుంచుని వుంది. ఏమీ మాట్లాడకుండా నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని గుప్పెట్లో అర్థ రూపాయి నాణెం వుంచింది. ఆమె కళ్ళల్లో అదో తృప్తి! వెనక్కి తిరిగి గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది. అమ్మ వచ్చేసింది. వేరే హోటల్లో పులిహోర పెట్టించింది. చెరుకుగడ కొన్నది. నేను కొండెక్కినంత సంబరపడ్డాను. పన్నెండవుతుండగా ఇంటిదారి పట్టేము. నరసమ్మ ఇచ్చిన అర్ధరూపాయి నా రేకుపెట్టెలో పడేశాను.

నాకు ఇప్పటికీ బాగా గుర్తు. ఆ తర్వాత చాలాకాలానికి ఏదో పెళ్ళిలో కలిశాం— నేనూ పెదనాన్నా. అందరూ ఆయనపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, మెచ్చుకోలు గౌరవంతో, అడుగులకు మడుగులొత్తుతూ తిరుగుతున్నారు. నాకా వాతావరణమంతా కృతకంగా అగుపించింది. అందరి మొహాల్లోకీ పరీక్షగా చూశాను. అంతా ఆత్మవంచన, కపట నాటకం. ఆ నాటకంలో ఆయన సంతానమూ ముఖ్య పాత్రధారులు కావడం నాకు మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది. భోజనాల దగ్గర— అన్నంపళ్ళెం పట్టుకున్నాడు ఆయన— వడ్డనకు. ఆయన పెద్దకొడుకు గబగబా వచ్చి పళ్ళేన్ని లాక్కుంటూ ఆయన్ని వారిస్తున్నాడు. "ఫర్వాలేదు. నాకు బాగా అలవాటైన పనే ఇది" అని ఆయన ముందుకు సాగుతున్నాడు. వాళ్ళిద్దర్నీ చూస్తూ నేను తక్కువ అన్నాను— ఆయన్ని వుద్దేశించి— "అన్నయ్య శ్రద్ధంతా నీ మీద కాదులే పెదనాన్నా— నీ డబ్బు మీద. పాపం మహా కష్టపడిపోతున్నాడు. పళ్ళెం ఇచ్చేసి హాయిగా కూర్చోరాదూ?" అన్నాను. ఆయన నావైపు అదోలా చూశాడు. ఆయన కుమారరత్నం మిర్రి మిర్రి చూశాడు. ఆ తర్వాత కొంతసేపటికి— పందిట్లో కూర్చుని తాంబూలం వేసుకుంటూ— మా అమ్మతో చెప్పేడు ఆయన, "నీ కొడుక్కి గీరతోపాటు

అతితెలివీ బాగానే వస్తోంది" అని. నేనూ దగ్గర్లోనే వున్నాను— ఏదో పత్రిక తిర గేస్తూ. "చూశావా?" అన్నట్టు అమ్మ నాకేసి చూపులు మరల్చింది.

బస్సు విజయవాడ వచ్చేసింది.

మా నాన్న పోయింది— విజయవాడ లోనే. ఆయన్ని మా వూరికి తీసుకు వెళ్లడం, శవదహనం— ఆ దృశ్యాలన్నీ నా కళ్ల ముందు మెదిలినై. అప్పుడు నేను బియ్యే మొదటి సంవత్సరంలో వున్నాను. ఒక నెలలో స్పెషల్ ఫీజులూ, టరమ్ ఫీజూ వొకేసారి చెల్లించాల్సి వచ్చింది. అమ్మా నేనూ ఏం చెయ్యాలో తెలీక దిక్కులు చూస్తున్న సమయం. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. చివ రికి అమ్మ బ్రహ్మానందం పెదనాన్నని చూపింది. నేను సుతరామూ యిష్టపడ లేదు మొదట్లో. కానీ అమ్మ ఎంతో నచ్చచెప్పింది. నా భవిష్యత్తు గురించి తనకున్న ఆశల్ని వల్లించింది. నేను అంగీకార సూచనగా మౌనంగా వుండి పోయాను. మేమిద్దరమూ పెదనాన్న యింటికి వెళ్లేం. నరసమ్మ మమ్మల్ని చాలా సాదరంగానే ఆహ్వానించింది. ఆయనా వున్నాడు— యింట్లో. అడ్డు వస్తున్న అభిమానాన్ని పక్కకు నెట్టి— చాలా బిడియంతో— ఆ విషయం ప్రస్తా వించి వూరుకుంది అమ్మ. ఆయన తన వుపన్యాసం మొదలెట్టాడు. నేను నేల చూపులు చూస్తూ వింటూ కూర్చున్నాను.

దానంతటి సారాంశం— జీవితంలో కష్ట పడి పైకిరావాలనీ; ఇతరుల వద్ద చేయి సాచకూడదనీనూ; మధ్య మధ్యలో తన అనుభవాల్ని గుర్తు చేశాడు ఆయన. నీతీ నిజాయితీగా బతకాల్సిన అవశ్యకత గురించీ గట్టిగానే హెచ్చరిక చేశాడు. నాకూ రోషంగానూ, ఉక్రోషంగానూ వుంది. అమ్మకళ్లల్లో సందేహం వున్నా; రవ్వంత ఆశల ఛాయలూ వున్నై. చివ రికి ఆయన మొండిచెయ్యి చూపుతున్నా డనీ, ఆ విషయాన్ని ఆయన చెప్పక చెప్తున్నాడనీ అర్థమైంది నాకు. ఉండబట్ట లేక అడిగేను నేను, "మీరు చెప్పిం దంతా బాగానే వుంది. గుర్రమూ నాడా కథలా, చెట్టూ విత్తనం వ్యవహారంలా మాట్లాడుతున్నారు మీరు. ముందు నే నీ చదువు పూర్తిచెయ్యాలి గదా— అనక ఎలా బతికినా ? పైగా నాదొక చిన్న సందేహం. నీతీనిజాయితీల గురించి ఇన్ని కబుర్లు చెప్పారు గదా— మీరు మూడుపైసలు గిట్టే ఇడ్లీని పదిహేను పైసలకి అమ్మడం న్యాయమేనంటారా? ఇది దోపిడీ కాదూ?" నా ప్రశ్నకు ప్రక్కనే ఫిరంగి పేలినట్లు ఉలిక్కి పడ్డాడు ఆయన. క్షణాల్లో తేరుకుని, "చొప్పదంటు ప్రశ్నలంటే ఇవే. చిన్నం తరం పెద్దంతరం లేకుండా, చూశావా, నీ కొడుకు ప్రశ్నలు?" అని అమ్మతో గసురుకున్నాడు. మా అమ్మ నా ప్రవ ర్తనకి కించపడ్డట్టు పక్కకి తప్పుకుంది.

మేము తిరిగి వచ్చేశాం. తనంటే నాకున్న అభిప్రాయాలన్నిటికీ— ఈ సంఘటన— ముక్తాయింపుగా తోచిఉండాలని నా అంచనా.

ఆ తర్వాత మళ్లీ ఆయన్ని నేను కలవలేదు. బియ్యే ఆపి ఉద్యోగంలో పడటం; అమ్మ మరణం, రమతో పెళ్లి, పిల్లలు; సంసారం ఊరుమారుటం, హైదరాబాద్ నగర యాంత్రిక జీవనం— సాగిపోతోంది.

బస్ తెనాలికి వచ్చేసింది.

కళకళలాడే కొత్త బస్‌స్టాండు, చాలా ఎత్తు ఎదిగిన రోడ్లు; కాలవలకు అటూ ఇటూ పిట్టగోడలూ మారాలని ప్రయత్నం చేస్తూ మారలేకపోతున్న మధ్యతరగతి వాడిలా వుంది మా వూరు. చిత్రమైన అనుభూతికి లోనయ్యింది మనస్సు.

నేను ఇంటికి వెళ్లేసరికే బ్రహ్మానందంగారు ఇహలోకంనుంచి వెళ్లిపోయారు. క్రితం రాత్రి ఆయన అసువులు వీడారు.

ఆయన సంతానం— కోడళ్లూ అల్లుడూ అంతా అక్కడ చేరివుంది. శవదహనానికి ఏర్పాట్ల గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. అంతా ఏదో తర్జనభర్జనల్లో మునిగివున్నారు.

గోడవారగా కూర్చున్న నరసమ్మ నన్ను చూసి లేచి వచ్చింది. నేనూ ఆవిడా వసారా మెట్లమీద కూర్చున్నాం.

"వారం రోజుల క్రితం ఆయన మంచాన పడ్డారు. ఈ వారం రోజులూ ఆయన ఎంత బాధపడ్డారో...." నరసమ్మ గొంతు పూడుకపోయింది. చీరచెంగుతో కళ్లొత్తుకుంది. మాటలు పెగల్చుకుని చెప్పింది, "నిన్ను చూడాలి, పిలిపించమన్నారు." ఆలస్యమైంది. చూపులు దక్కలేదు.

ఆయన కొడుకులూ, కూతుళ్లూ మా కేసి చూసి మొహాలు మాడ్చుకునీ, మూతి విరుచుకునీ, చూపులు మరల్చుకొన్నారు. గుండెల్లో అనుమానం, భయం, సందేహం!— ఇన్ని రకాల అగ్గి రగులుతుంటే మొహాలు మాడిపోకుండా వుంటాయా?

నరసమ్మే అన్నది, "నీకు తెలుసో తెలియదో గానీ; ఆ వేళ నువ్వూ మీ అమ్మా డబ్బుకోసం వచ్చి వెళ్లారు గుర్తుంది కదూ— అప్పట్నుంచీ ఆయన వ్యాపారం ఎత్తేశారు."

నేను ఆశ్చర్యపోయాను. అంటే— నా మాటలు ఆయనమీద అంత తీవ్రంగానూ, అంత త్వరగానూ పనిచేశాయన్న మాట!

క్షణాల తర్వాత అప్పుడు నలుగుతున్న సమస్య తెలిసింది నాకు. ఆయన ఆస్తిపాస్తుల గురించి తెలియనిదే శవదహనానికి పూనుకోరట— కొడుకులు.

సుబ్రహ్మణ్యంగారు వచ్చారు. ఆయన లాయరూ, మా పెదనాన్నకి మంచి మిత్రుడూ. ఆస్థిని బ్రహ్మానందంగారు

ఏంచేశారో విల్లు చదివి వినిపించాడు ఆయన.

అదివిని అంతా రిచ్చపడ్డారు. నేను నరసమ్మ మొహంలోకి చూశాను. అవిడ నిర్లిప్తంగా శూన్యంలోకి చూస్తోంది. కొబ్బరిచెట్టు మొదట్లో కూర్చున్న అల్లుడు- తువ్వాలా విదిలించి తలకు చుట్టాడు; సిగరెట్ వెలిగించుకున్నాడు. "ఇహ పదండోయ్. చావు కబురు చల్లగా తెలిసిందిగా." అన్నాడు- బావమరుదుల్ని వుద్దేశించి.

అంతా శవంమీదగా నడచుకుంటూ వెళ్లిపోయారు. ఊళ్లో జనం ముక్కునవేలేసుకున్నారు; ఛీ కొట్టారు; తలో మాటా అన్నారు.

ఆ తర్వాత కార్యక్రమాన్ని నేనే పూర్తిచెయ్యాల్సి వచ్చింది.

ఆ రాత్రి—

ఇన్ని మజ్జిగనీళ్లు తాగి పడుకున్నాను.

సుబ్రమణ్యంగారు వచ్చేరు. విల్లులో విషయాల్ని మళ్లీ వివరంగా చెప్పేరు. ఒక బిల్డింగ్‌నీ, లక్షరూపాయల నగదునీ పాఠశాలకు రాశారు. దానికి ఆయనా నేనూ ట్రస్టీలం. మిగిలిన స్థిరచరాస్తులన్నీ నరసమ్మకి చెందుతాయ్. ఇదీ సారాంశం!

ట్రస్ట్ భవిష్యత్ కార్యక్రమం గురించి మళ్లీ రాస్తానన్నాడు.

కర్మాంతరాలు కాగానే హైదరాబాద్ తిరిగి వచ్చేశాను.

—జరిగిందంతా విని సన్నగా నవ్వింది, రమ. బ్రహ్మానందం పెదనాన్న నన్ను చూడాలని ఎందుకు పిలిపించమన్నాడో అర్థంకాలేదు నాకు.

—నెల రోజులు గడిచినై.

నరసమ్మ వచ్చింది, ఆశ్చర్యపోయాను. పరామర్శలయ్యాక చెప్పింది "ఆస్థిని ఆయన సంతానానికి రాయించి రిజిష్టర్ చేయించాను. ఇప్పుడు ప్రాణం తేలికపడింది. నెత్తిమీదినుంచి బరువు దించినట్లైంది. ఏదో, ఈ కష్టైనీ నీ చేతులమీదుగానే వెళ్లిపోనీ!"

ఆత్మ లభించినట్లయింది నాకు! నా పాత ట్రంకుపెట్టె మూలగా వున్న అర్థరూపాయి గుర్తొచ్చింది సూర్యుడిలా వెలిగిపోతోంది- నరసమ్మ. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడిచుట్టూ కూడా తిరుగుతోంది!!!

